సీరియల్

వి.యస్.రావ్

(గత సంచిక తరువాయి)

"విరూపాక్షరావు గురించి నువ్వు వినలేదనుకుంటాను!" అతను సూటిగా చూస్తూ అన్నాడు.

"వాడెవడు?" మనోజ్ నిర్లక్ష్యంగా అడిగాడు.

అతని మొహం బిగుసుకుపోయింది. బుర్రమీసాలకింద పెదవులు వణికాయి. వాటిమధ్య కరోనా సిగార్‌ని ఇరికించి, పొగలాగాడతను.

"మనోజ్, వాడెవడు అని నువ్వడిగిన విరూపాక్షరావుని నేనే!" అతని కంఠంలో గర్వం గంటలా ధ్వనించింది.

మనోజ్ ఆశ్చర్యంగా చూశాడు. పెదవులు బిగపట్టి, పైకి తన్నుకొస్తున్న నవ్వుని మింగేశాడు. "బెలూన్నీ, న్యూస్ పేపర్నీ నా వెంట యెందుకు పంపించావు?" ఏక

వచనంతో ప్రశ్నించాడు. తన పక్కనే నుంచున్న సింహం ఊపిరి బిగబట్టడం అతనికి వినిపించింది.

విరూపాక్షరావు మొహం మళ్ళీ రాయిలా బిగుసుకు పోయింది. ఏకవచనంలో సంబోధించడం అతనికి అల వాటు లేనట్టుంది. అతనుమానంగా మనోజ్‌ను చూస్తూ ఉండిపోయాడు. మనోజ్ వోరగా చూశాడు. సింహం వేళ్ళు పిడికిళ్ళుగా బిగుసుకున్నాయి. తన యజమానిని అటాక్ చేయబోతున్న అపరిచిత వ్యక్తిని చూస్తున్న ఆల్సేషియన్ చూపుల్లా వున్నాయతని చూపులు.

"సింహం, అతని బేడీలు తీసెయ్!" విరూపాక్షరావు మాటలు వినిపించి, మనోజ్ నమ్మలేనట్టు అతన్ని చూశాడు. సింహం అతని వెనక్కి జరిగాడు. విడుదల పొందిన తన చేతుల్ని మనోజ్ క్షణకాలం చూశాడు. రాగికడియాల్లా వాతలు పడ్డాయి.

"సింహం, వెళ్ళు!" విరూపాక్షరావు కంఠం గంభీ రంగా ధ్వనించింది. మనోజ్ ఆశ్చర్యంతో అతన్ని చూస్తున్నాడు. విరూపాక్షరావు తదేకంగా చుట్టకొసని పరీక్షిస్తున్నాడు. తలుపు మూసుకున్న చప్పుడు వినిపించి, మనోజ్ తిరిగిచూశాడు. హాలు ఖాళీగా వుంది.

మనోజ్ మెరుపులా కదిలాడు. విరూపాక్షరావు ముందు టేబుల్‌మీదున్న తన కత్తిని అతని వేళ్ళు చుట్టేశాయి.

"మనోజ్ విగ్రహంలా నుంచో!" విరూపాక్షరావు కంఠం గంభీరంగా ధ్వనించింది. ఏదో చప్పుడు మనోజ్ చెవులకి లీలగా వినిపించింది. కత్తిని పట్టుకున్న చెయ్యి గాలిలో ఆగింది.

"మనోజ్, మెల్లిగా తలతిప్పి, నీ కుడివైపుకు

చూడు!" విరూపాక్షరావు కంఠంలో బెదిరింపులేదు.

మనోజ్ తలతిప్పి చూశాడు. ఇందాక గోడకి అనుకొని కనిపించిన ఆరడుగుల ఆయిల్ పెయింటింగ్ లేదు. అస్థిపంజరంలా సన్నగా వున్న వ్యక్తి గోడలో యేర్పడిన అరలో విగ్రహంలా నిలబడ్డాడు. అతని పాము కళ్ళు మెల్లిగా కదిలాయి. అతని చేతుల్లో నిర్లక్ష్యంగా పట్టుకున్నట్టున్న గన్ తన ఛాతీమీదకి గురిపెట్టబడటం మనోజ్ గుర్తించాడు. ఆ వ్యక్తి మొహంమీద చిరునవ్వు ప్రత్యక్షమైంది.

చుట్టూ ఆవరించిన నిశ్శబ్దాన్ని చిన్న చప్పుడు భంగం చేసింది. ఆ చప్పుడేమిటో మనోజ్‌కి బాగా తెలుసు. గన్ సేఫ్టీ కాచ్ రిలీజ్ చేయబడింది! అప్రయత్నంగా మనోజ్ తల ఇంకొంచెం తిరిగింది. రెండో ఆయిల్ పెయింటింగ్ స్థానంలో ప్రత్యక్షమైన మరో వ్యక్తిని అతను ఆశ్చర్యంతో చూశాడు.

ఉక్కు బంతిలా నున్నగా మెరుస్తున్న బోడిగుండు. కాకి ఈకల్లాంటి మీసాలు. వాటికింద తెల్లగా మెరుస్తున్న గొగ్గిరిపళ్ళు. రక్తదాహంతో చూస్తూన్నట్టున్న ఎర్రటి కళ్ళు. అతని చేతుల్లోని సాన్ ఆఫ్ షాట్‌గన్ రంధ్రం తన పొట్టని చూస్తోంది.

గదిలోకి వచ్చాక తను చూసిన ఆరు ఆయిల్ పెయింటింగ్స్ మనోజ్‌కి గుర్తొచ్చాయి. అతని కళ్ళు గోడ వెంట పరుగెత్తాయి. ఆయిల్ పెయింటింగ్స్ బదులు, గన్స్ పట్టుకొని, తననే ఆకలిగా చూస్తున్న వ్యక్తుల్ని మనోజ్ రెప్పపాటులో చూశాడు.

"మనోజ్, నీ ఎడమవైపు కూడా ఆరుగురు వ్యక్తులు నిన్నే చూస్తున్నారు. వాళ్ళ కళ్ళకి నువ్వు 'బుల్స్ఐ'లా

వున్నావ్. కావాలంటే చూసుకో!" విరూపాక్షరావు కంఠం హెచ్చరించింది.

మనోజ్ చూస్తున్నాడు. విరూపాక్షరావు కంఠం నవ్వుతూ సగర్వంగా శబ్దం చేసింది.

"మనోజ్..."

మనోజ్ తలతిప్పి అతన్ని చూశాడు. అతని కళ్ళు మెరుస్తున్నాయి. అతని పెదాలమధ్య ఇరుక్కున్న చుట్ట ఎర్రగా వెలిగింది. ఆ వెల్తురు అతని కళ్ళకి ఎర్ర రంగు పూసింది.

"నా ఎడమకాలికిందున్న బటన్ నొక్కబడితే, తుపాకులు పేలుతాయ్! నీ శరీరం ఏకిన దూదిపింజల్లా ఎగిరిపోతుంది! కత్తిని వదిలెయ్!"

అప్రయత్నంగా మనోజ్ వేళ్ళు వదులయ్యాయి. కత్తి బల్లమీదపడుతూ చిన్నగా చప్పుడు చేసింది.

విరూపాక్షరావు కత్తినితీసి, జేబులో పడేసుకున్నాడు. విజయవంతంగా నవ్వుతూ మనోజ్ వైపు చూశాడు. జేబులోమీదున్న సన్నటి దంతం దువ్వెనని వేళ్ళమధ్య ఇరికించి, బుర్రమీదపాల్ని జాగ్రత్తగా దువ్వుకున్నాడు. నవ్వుతున్న కళ్ళని మనోజ్ వైపు తిప్పాడు. కుర్చీలోంచి లేచి, ఎత్తుగా ఠీవిగా నిలబడ్డాడు.

"మిస్టర్ మనోజ్, గురిపెట్టిన డజను తుపాకులమధ్య నీకు ఇబ్బందిగా వుంటుంది. నా గదిలోకి వెళ్దాం...."

"ఎందుకు?" మనోజ్ అడ్డొస్తూ ప్రశ్నించాడు. విరూపాక్షరావు ప్రవర్తనా, మాటలూ అతనికి అగమ్యగోచరంగా వున్నాయి.

విరూపాక్షరావు సిగార్ ని పైకెతిప్పి పట్టుకున్నాడు. కాలుతున్నకొసని పొగతో ఊదాడు. మనోజ్ ని తదేకంగా చూశాడు.

"నన్ను నీకు శత్రువుగా నువ్వు భావిస్తున్నావు. నేను నీ శత్రువు కానని నిరూపించడానికి!" అంటూ విరూపాక్షరావ్ వెనక్కి తిరిగాడు.

వెనకవైపున వాల్ పేపర్ తో పూర్తిగా కప్పబడిన గోడ మధ్యభాగంలో ఆగాడు. అతని ఎడమచెయ్యి పైకి లేచింది. వాల్ పేపర్ డిజైన్ లో వున్న పులిబొమ్మ మొహంవైపు అతని చూపుడువేలు సాగింది.

మనోజ్ కదలకుండా చూస్తున్నాడు. విరూపాక్షరావు చూపుడు వేలు పులిబొమ్మ ఎడమ కంటిని తాకింది. అతనిముందు ద్వారబంధం సైజులో వాల్ పేపర్ కదిలింది. నిశ్శబ్దంగా. గుమ్మంలా ప్రత్యక్షమైన ప్రదేశాన్ని మనోజ్ ఆశ్చర్యంతో చూశాడు.

లోపలికి అడుగు వేసి, విరూపాక్షరావు వెనుదిరిగి నిలబడ్డాడు. బలంగా, పొడుగ్గా వున్న విరూపాక్షరావు నకిలీ గుమ్మంలో, ఫ్రేములో ఇరికించబడిన యెవరో రాజాగారి ఆయిల్ పెయింటింగ్ లా అవుపిస్తున్నాడు. కదలకుండా చెట్టులా నిలబడ్డ మనోజ్ ని అతను చిరునవ్వుతో చూశాడు

"మనోజ్, ప్రస్తుతం నువ్వు నా గుప్పిట్లో వున్నావు. నేను అనుకుంటేగాని నువ్వు బైటపడలేవు! లోపలికిరా సత్యాన్ని చూపిస్తాను!" విరూపాక్షరావు కంఠం గంభీరంగా ధ్వనించింది.

తన చుట్టూ సిపాయిల్లా తుపాకులు గురిపెట్టి నుంచున్న

వ్యక్తుల్ని వోసారి కలియజూసి మనోజ్ మెల్లిగా కదిలాడు.

• • •

చిన్న గదిలో టేబుల్ ముందు నిలబడి విరూపాక్ష రావు మనోజ్ వైపు నవ్వుతూ చూశాడు.

"సిడౌన్, మనోజ్!"

మనోజ్ కూచోలేదు, బాక్స్‌లా వున్న గదిని పరిశీలనగా చూస్తూ ఉండిపోయాడు. ఎదురుగా వున్న గోడని సముద్రంమీద, దిక్చక్రంలో ఎర్రగా అస్తమిస్తున్న సూర్యుడున్న చిత్రం పూర్తిగా కప్పేసింది. తతిమ్మా మూడు గోడల్ని రకరకాల ప్రకృతి దృశ్యాలు మరుగుపరిచాయి. గజిబిజిగా ఉన్న ఆ చిత్రంలో ఎక్కడ యే మీట ఉందో తెలుసుకోడం కష్టం.

"మనోజ్, నువ్వు గోపుని చూసి గుంటనక్క అనుకున్నావు!" విరూపాక్షరావు కంఠం మనోజ్ దృష్టిని మళ్ళించింది. అతను విరూపాక్షరావుని తీక్షణంగా చూశాడు.

"మా వదినా, గీతా మరణించడానికీ, మా అన్నయ్యా జైలుపాలవడానికీ కారణం నువ్వే!"

విరూపాక్షరావు నవ్వుతూ కుర్చీలో కూచున్నాడు.

"నీకోసం వెతుకుతున్న నన్ను నీ శిష్యులు నీ దగ్గరకు లాక్కొచ్చారు. వాళ్ళకి నేను ఋణపడ్డాను..నువ్వు.."

"నిప్పుని జేబులో పడేసుకునేంత మూర్ఖుణ్ని కాను నేను!" విరూపాక్షరావు అడ్డుకుంటూ, బిగ్గరగా అన్నాడు. "మొదట్నుంచీ నీ పరిశోధన తప్పుదారిన వెళ్తోంది. వేరే కారణంగా నిన్ను వెంటాడుతున్న నా అనుచరుల్ని నువ్వు అసలు వ్యక్తులుగా భావించావు!"

మనోజ్ విరూపాక్షరావు కళ్ళల్లోకి చూస్తూ ఉండి పోయాడు. అతని కళ్ళు తీక్షణంగా వున్నాయి. వాటిలో దాపరికం, నటన కనిపించడంలేదు. మరి విరూపాక్షరావు తనని ఎందుకు ఫాలో అయ్యాడు?

“జరిగిందానికి కారకులైన వ్యక్తులు వేరే వున్నారు! నీ పక్కనే వున్న వాళ్ళని నువ్వు పోల్చుకోలేక పోయావు. నువ్వు కలుసుకోబోయే ప్రతి వ్యక్తినీ వాళ్ళు హత మార్చారు! నా అనుచరుల ద్వారా నిన్ను చూసినట్టే, వాళ్ళనీ నేను చూశాను; చూస్తున్నాను చూస్తూ వుంటాను?”

“ఎందుకు?” మనోజ్ ప్రశ్నించాడు. విరూపాక్షరావు మాటల్ని యెందుకో నమ్మాలనిపిస్తోం దతనికి.

“వంటూమెని కల్సుకోవాలనుకున్నావు. ముందుగా వెళ్ళి ‘వాళ్ళకి’ నీ ఉద్దేశాన్ని తెలియజేశావు....!”

“ఎవరు వాళ్ళు?”

విరూపాక్షరావు చిన్నగా నవ్వాడు. “మస్తాన్ రావునీ, టాక్సీ డ్రైవర్నీ కల్సుకోబోయావు. వాళ్ళు లోయలోకి తోయబడ్డారు!” విరూపాక్షరావు మనోజ్ ప్రశ్నను నిర్లక్ష్యం చేస్తూ అన్నాడు.

“ఎవరు వాళ్ళు?” మనోజ్ అరిచాడు.

“చెప్తాను. అందుకే నిన్ను రప్పించాను. మొదట్నుంచీ నువ్వు సింహాన్నీ, హనుమాన్‌నీ అనుమానించావు....”

“హనుమాన్ .... బెలూనా?” మనోజ్ అడిగాడు.

విరూపాక్షరావు అవునన్నట్లు తలాడించాడు. మనోజ్ అతన్ని తీక్షణంగా చూశాడు.

“మిస్టర్ విరూపాక్షరావ్, నువ్వు చెప్పేది నిజమైతే, నీ తోకల్ని నా తోకలుగా మార్చి, నన్ను తప్పుదారి

పట్టించింది నుక్కే! అసలు వ్యక్తుల్ని పోల్చుకోకుండా నీ శిష్యులు అడ్డుతగిలారు!" మనోజ్ కంఠంలో ఆక్షేపణ ధ్వనించింది.

చిన్నగా నవ్వుతూ విరూపాక్షరావు సిగార్ వెలిగించాడు. "సూరి. అంతా వివరిస్తాను...." అన్నాడు తను సిగార్‌తో కుర్చీ చూపుతూ. మనోజ్ అప్రయత్నంగా కూచున్నాడు.

"నీ అన్వేషణ ఎలా సాగుతోందో తెలుసుకోడానికి నా మనుషులు ప్రయత్నించారు; దానికి కారణం వుంది. అమెరికాని గడగడలాడిస్తున్న మాఫియా ఫక్కీలో తన నేర పరంపరని జయప్రదంగా సాగించుకుపోతున్న ఒక ముఠా దీనికంతటికీ కారణం...."

మనోజ్ ఆశ్చర్యంగా చూశాడు. "మీకెలా తెలుసు?" మొదటిసారిగా తనని బహువచనంలో మన్నించిన మనోజ్‌ని విరూపాక్షరావు చిరునవ్వుతో చూశాడు.

"ఇలాంటి విషయాల గురించిన రన్నింగ్ కామెంటరీ యెప్పుడూ నాకు వినిపిస్తూ ఉంటుంది!" సగర్వంగా అన్నాడతను.

"ఆ ముఠాకి మా అన్నయ్య యే అపకారం చేశాడు?" మనోజ్ ప్రశ్నించాడు.

విరూపాక్షరావు రెప్ప వేయకుండా చూశాడు. "నిజం చెప్పాలంటే నాకు తెలీదు! కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను: చీకట్లో చూడకుండా తొక్కి తొక్కినా కూడా త్రాచుపాము బుసకొట్టి కాటేస్తుంది! మీ అన్నయ్య విషయంలో అదే జరిగిందని నా నమ్మకం. మీ అన్నయ్య గురించి నాకు తెలుసు. అతను నిజాయితీపరుడు...."

మనోజ్ విరూపాక్షరావుని చిరునవ్వుతో చూశాడు. "మీరే ఇదంతా చేయించారన్న అనుమానం పొరపాటని నాకు అనిపిస్తోంది. చెప్పండి. వాళ్ళెవరు?"

విరూపాక్షరావు చిన్నగా నవ్వాడు. "మనోజ్, వాళ్ళెవరో తెలుసుకునేలోగా, మరికొన్ని విషయాలు నువ్వు తెలుసుకోవాలి!"

మనోజ్ అతని కళ్ళల్లోకి చూశాడు. విరూపాక్షరావు కళ్ళు మెరుస్తున్నాయి. ఆరిపోయిన కళోవాని వెలిగించి అతను ప్రారంభించాడు:

"చట్టం, కోర్టూ మా అన్నయ్య నిర్దోషిత్వాన్ని గుర్తించి, అపరాధుల్ని శిక్షిస్తాయని నేను ఆశించాను. కానీ చెవులు మాత్రం వున్న కోర్టు ఎవరో పలికించిన ఎన్నో అసత్యాల్ని వింది; సత్యాన్ని చూడలేకపోయింది. పాటి లాయర్లు కరుణాకర్ కి సహాయం చేయలేకపోయారు. నువ్వు రంగంలోకి దిగావు. కానీ మనోజ్, అసలు వ్యక్తుల్ని పసిగట్టడంలో నువ్వూ విఫలమయ్యావు! అంచేత నిన్ను తప్పుదారినుండీ సరైన దారికి మళ్ళించాలని నిర్ణయించుకున్నాను..."

"ఎందుకు?" మనోజ్ అడ్డొస్తూ ప్రశ్నించాడు. "మా అన్నయ్యమీద మీకెందుకంత ప్రేమ?"

విరూపాక్షరావు చిన్నగా నవ్వాడు. అతని కళ్ళు పెన్సిల్ టార్చిలైట్లలా మనోజ్ ని తీక్షణంగా చూశాయి. "మీ అన్నయ్యమీద ప్రేమకాదు; అన్యాయంమీద ద్వేషం!"

మనోజ్ కనుబొమలు పైకిలేస్తూ అతని ఆశ్చర్యాన్ని ప్రకటించాయి.

"అమాయకులు అన్యాయానికి బలైపోవడం నేను

సహించను! నా ప్రయత్నం లేకుండా కరుణాకర్ కి న్యాయం జరుగుతుందని ఆశించాను; వేచిచూశాను. అక్రమాన్ని దండించి, అమాయకత్వాన్ని రక్షించడంలో చట్టం విఫలమైంది! ఆ వైఫల్యాన్ని, బాధ్యతగల పౌరుడిగా నేను సహించను!" విరూపాక్షరావు కంఠం ఆవేశంతో గంటలా ధ్వనించింది.

"ఏం చేస్తారు?" మనోజ్ నవ్వుతూ ప్రశ్నించాడు.

"రాజమార్గంలో వీలుకానప్పుడు దొడ్డిదారిగుండా న్యాయాన్ని వెలికి రప్పించి, పునఃప్రతిష్ఠ చేసే ప్రయత్నం చేస్తాను!" విరూపాక్షరావు కంఠంలో ఏదో విప్లవశంఖం మ్రోగింది. అతని కళ్ళు రత్నాల్లా తళుక్కుమంటున్నాయి.

"చట్టం చేతికి చిక్కకుండా దుర్మార్గులు, అవినీతిపరులు మీ వదినను హతమార్చారు. గీతను మానభంగం చేసి రాక్షసంగా చంపారు. దాన్నంతా అతితెలివిగా కరుణాకర్ నెత్తిన రుద్ది, అతన్ని నిలువవేశారు. అలాగే చట్టం చేతికి చిక్కకుండా వాళ్ళని హతమార్చే ప్రయత్నంలో నీకు పరోక్షంగా సహాయం చేస్తాను!" విరూపాక్షరావు ఉద్రేకంగా అన్నాడు.

మనోజ్ ఆవేశంతో లేచి నిలబడ్డాడు. ఉత్సాహంగా అతని మొహంలోకి చూశాడు. "విరూపాక్షరావుగారూ, మీ మోటివ్ ని నేను మెచ్చుకుంటున్నాను. హృదయపూర్వకంగా మీ సహాయాన్ని స్వీకరిస్తాను! వాళ్ళెవరో నాకు చెప్పండి!"

"మనోజ్, సిడౌన్!" విరూపాక్షరావు చిరునవ్వుతో అన్నాడు.

మనోజ్ కూచున్నాడు.

"నీ హృదయాన్ని దారుణంగా గాయపరిచిన క్రూర

మృగాల్ని నీకు నేను చూపిస్తాను.... అయితే, నువ్వు నాకో సాయం చేయాలి...."

"చెప్పండి. నా పగ తీర్చుకోడంలో సహకరిస్తున్న మీకు ఏ సహాయం కావాలన్నా చేస్తాను!" మనోజ్ ఉద్రేకంతో అన్నాడు.

"మనోజ్, బుద్ధిబలంతో, నిజాయితీగా నేను ఎంతో పెద్దవాణ్నయ్యాను. వ్యాపారంలో ఘన విజయాల్ని సాధించాను. ఐశ్వర్యం, పలుకుబడీ నాచుట్టూ కోట గోడల్లా ఎదిగాయి. అలాగే నన్నూ నా నీతిని ద్వేషించే స్వార్థపరులైన శత్రువులూ పెరిగారు. ధర్మయుద్ధంలో ధైర్యంగా నాతో ఢీకొనే శక్తిలేని ఆ పిరికిపందలు దొంగ చాటుగా నన్ను దెబ్బతీయడానికి కుట్రలు పన్నుతున్నారు. వాళ్ళ పథకాల్ని ఎప్పటికప్పుడు నేను గోటితో ఛిన్నాభిన్నం చేస్తూ వచ్చాను. కానీ...." విరూపాక్షరావు తన ఆవేశాన్నీ, ఆగ్రహాన్నీ దిగమింగుతూ ఆగాడు.

"కానీ, పదిరోజుల క్రితం, నా అనుచరులు ముగ్గుర్ని వాళ్ళు బంధించి తీసుకెళ్ళారు. వాళ్ళని ఎక్కడో దాచి వుంచారు...."

"మీ అనుచరులు....ఎవరు?" మనోజ్ అడ్డొస్తూ ప్రశ్నించాడు.

"నాకున్న మూడు కుడిభుజాలు! నా మూడు కళ్ళు!" విరూపాక్షరావు పళ్ళు కొరుకుతూ అన్నాడు.

"వాళ్ళని బంధిస్తే వాళ్ళకి ఏమిటి లాభం?"

విరూపాక్షరావు చిన్నగా నిట్టూర్చాడు. "మనోజ్, నువ్వు సమాజానికి మేలు చేయాలంటే తగిన పదవిలో వుండాలి ఆ పదవికి ఎక్కాలంటే సూటిగా మెట్లు ఉపయోగించలేవు. అడ్డదిడ్డంగా, డొంకతిరుగుడుగా వస్తేగానీ

నువ్వు పై మెట్టు చేరుకోలేవు. ప్రజలకి ఉపయోగపడాలన్న ధ్యేయంతో నేను పైకి ఎగబాకాను. ఆ ప్రయత్నంలో ముక్కుసూటిగా వెళ్ళడం సాధ్యంకాలేదు. అవన్నీ నా విజయరహస్యాలు. అవన్నీ నా అనుచరులకి శుభ్రంగా తెలుసు. అవి నా శత్రువులకి తెలియడం ప్రమాదం...."

"మిమ్మల్ని భయపెట్టే గతం మీకుందని అంగీకరిస్తున్నారు!" మనోజ్ చిరునవ్వుతో అన్నాడు.

"అంతస్తు ఎక్కిన వ్యక్తికి గతం సాధారణంగా అద్దంలా వుండదు! ఇతర్లకి అపకారం చేయకపోయినా, నా గతం కొన్ని సందర్భాల్లో నా పరపతికి భంగం కలిగిస్తుంది...." విరూపాక్షరావు ఆగి, మనోజ్ ని తదేకంగా క్షణకాలం చూశాడు.

"మనోజ్, ప్రజలకోసం నేనో బ్రహ్మాండమైన పథకం రూపొందిస్తున్నాను. వాళ్ళ జీవితాల్ని స్వర్గంలా చేయకపోయినా, నరకం కాకుండా చూడ్డానికి 'మానవత' అనే సరికొత్త పార్టీని స్థాపించబోతున్నాను. నా మానవత పార్టీ అధికారంలోకి వస్తుందని నాకు తెలుసు. అది జరిగే సమయంలో నా గతం వెలికి రాకూడదు! అందుకే నా రహస్యాలు తెలిసిన నా శిష్యుల్ని శత్రువుల ఉక్కుపిడికిళ్ళ నుండి విడిపించుకురావాలి!"

"ఇప్పటికే వాళ్ళు మీగురించి బుర్రకథలు చెప్పేసి వుండొచ్చు" మనోజ్ నవ్వుతూ అన్నాడు.

విరూపాక్షరావు తల అడ్డంగా ఆడించాడు. "వాళ్ళ గురించి నీకు తెలీదు. మొదట నయానా భయానా వాళ్ళని మాట్లాడించడానికీ, వాళ్ళని తమలో చేర్చుకోడానికీ శత్రువులు ప్రయత్నిస్తారు. తరవాత టార్చర్

ప్రారంభిస్తారు. కొంత లిమిట్ దాకా టార్చర్ని నా వ్యక్తులు తట్టుకోగలరు. వాళ్ళు పూర్తిగా లొంగిపోయే లాగా వాళ్ళని మనం విడిపించుకోవాలి!"

"అంటే, నేను వాళ్ళని విడిపించుకు రావాలి! అంతేగా?" మనోజ్ ప్రశ్నించాడు.

విరూపాక్షరావు చిరునవ్వు నవ్వాడు. "సరిగ్గా ఊహించావ్!"

మనోజ్ అతన్ని సూటిగా చూశాడు. "మీకు ధన బలం వుంది. జనబలం వుంది. ఆ పని మీరే ఎందుకు చేయకూడదు?"

"నా వాళ్ళందరిగురించీ నా శత్రువులకి బాగా తెలుసు. ఆ ప్రయత్నంలో నా మనుషులు కదిలితే వాళ్ళు పసిగడతారు! వాళ్ళకి అపరిచితుడైన కొత్త వ్యక్తి, పట్టుదలా సాహసం వున్న వ్యక్తి నాకు కావాలి! ఆ వ్యక్తి నువ్వే!"

మనోజ్ కుర్చీలో వెనక్కి వాలాడు. "ఆ పని నేను చేయనంటే ఏం చేస్తారు?"

విరూపాక్షరావు చిన్నగా నవ్వాడు. "చేయనని నువ్వు అనలేవు! ఎందుకంటే—ఆ పని చేస్తేగానీ, నీ శత్రువుల్ని నీకు చూపించడం జరగదు!"

మనోజ్ లోపల్లోపలే పళ్ళు కొరుక్కున్నాడు. "మిస్టర్ విరూపాక్షరావ్, మీరు చూపించకపోయినా నేను కనుక్కుంటాను!" అన్నాడు గంభీరంగా.

విరూపాక్షరావు బిగ్గరగా నవ్వాడు. "మనోజ్, నీకు అనుభవం తక్కువ. నువ్వు వెతకడం ప్రారంభించేసరికి పక్షులు ఎగిరిపోతాయ్! వలవిసిరి వాట్ని పట్టేసరికి మీ అన్నయ్య జీవితఖైదు పూర్తయిపోతుంది!"

మనోజ్ మాట్లాడకుండా చూశాడు. జరిగిందాన్ని బట్టి

చూ స్తే విరూపాక్షరావు చెప్తోంది నిజమే అనిపిస్తోంది....

"నువ్వు కల్పనలో దానికి ప్రయత్నించే ప్రతీ వ్యక్తీ అచిర కాలంలో శవంగా మారుతాడు! చివరకు నువ్వుకూడా. తనుగురించి ఏమీ తెలీకపోడం ఇందులేఖ ప్రాణాల్ని కాపాడింది...." విరూపాక్షరావు మెల్లిగా ఆగి, మరో సిగార్ వెలిగించాడు.

ఇందులేఖ! ఆమెగురించి కూడా విరూపాక్షరావుకి తెలుసు! పంటితో పెదవిని నొక్కుకుంటూ మనోజ్ ఆలోచనగా చూశాడు.

"మనోజ్, ఆదమరిచి వున్న సమయంలో నువ్వు బెల్బులి మీదికి లంఘించాలి! అది జరగాలంటే ఆ బెల్బులి ఎక్కడుందో నీకు తెలియాలి. తెలియాలంటే నేను చూపించాలి!"

"ఆల్ రైట్! మీ షరతు అంగీకరిస్తున్నా. నేను వెతుకుతున్న వ్యక్తి ఎవరో, ఎక్కడున్నాడో చెప్పండి!" మనోజ్ తనలో నిర్ధారణ చేసుకొని అన్నాడు.

"సారీ మనోజ్, నా పని పూర్తిచేసేదాకా చెప్పను. అసలు వ్యక్తుల్ని నీకు చూపిస్తే నా పని విస్మరించి వాళ్ళ మీదికి దూకుతావు!" విరూపాక్షరావు చిన్నగా నవ్వాడు.

మనోజ్ కళ్ళు పెద్దగా చేస్తూ చూశాడు. "పనయ్యాక మీరు నాకు సహాయం చేస్తారన్న గ్యారంటీ ఏమిటి?"

విరూపాక్షరావు గొల్లున నవ్వాడు. "విరూపాక్షరావు మిత్రుల్ని దగా చెయ్యడు."

మనోజ్ తటాలున లేచాడు. రెండు చేతుల్నీ టేబుల్ మీద ఆన్చి, తీక్షణంగా అతని కళ్ళల్లోకి చూశాడు. "మిస్టర్ విరూపాక్షవ్, మీ శిష్యుల్ని బంధించిన వాళ్ళే ఇదంతా చేశారా?"

విరూపాక్షరావు పెదవులు నవ్వుతో విచ్చుకున్నాయి. "మనోజ్, వాళ్ళే నీ శత్రువులని చెప్తే, నాకు సాయం చేయమని నిన్ను అడిగే అవసరం వుండదు! కానీ, నేను అబద్ధాలాడను! ఆ మాటా వేరు. నా శిష్యుల్ని తీసుకుని తిరిగి రా. నీ శత్రువుల్ని నీకు చూపిస్తాను!"

మనోజ్ చిరునవ్వు నవ్వాడు. విరూపాక్షరావు నిజాయితీ అతని మాటల్లో ధ్వనిస్తోంది. నిజమే. వాళ్ళే వీళ్ళని తనకి చెప్తే తను వీళ్ళని సర్వనాశనం చేస్తాడు! తప్పుచేసింది ఒకరైతే, శిక్ష వేరొకరు అనుభవిస్తారు. మనోజ్ కుడిచేతిని ముందుకి చాచాడు.

"మిస్టర్ విరూపాక్షరావ్, మీ నిజాయితీని మెచ్చుకోకుండా వుండలేను. మీ పని చేసిపెడతాను: నాకు మీ సహకారం అందించండి!" అన్నాడు ఉద్రేకంతో.

విరూపాక్షరావు పైకి లేచాడు. సిగార్ని యాష్ ట్రే మీద పెట్టి, మనోజ్ చేతిని పట్టుకున్నాడు. నవ్వుతూ చూశాడు. "మనోజ్, ఈ క్షణంనుంచి మనం స్నేహితులం!"

"చెప్పండి, మీ శిష్యుల్ని బంధించిందెవరు?" మనోజ్ కంఠంలో ఆత్రుత ధ్వనించింది.

"మనోజ్. ముందుగానే చెప్తున్నా! నువ్వు ప్రమాదంలోకి అడుగు పెడుతున్నావు. అడుగుకో పద్మవ్యూహం నీకు అడ్డుతగులుతుంది. జాగ్రత్తగా జయించుకురావాలి! ఏమాత్రం పొరపాటు...."

"ఎవరో చెప్పండి!" మనోజ్ అడ్డుతగులుతూ అన్నాడు.

విరూపాక్షరావు చిన్నగా నవ్వుతూ అతని చేతిని వదిలేశాడు. "మనోజ్, మనుషుల్ని చంపడం నాకు

ఇష్టం లేదు. అవసరమైతేగానీ ఎవర్నీ చంపను...."

"మీరు నాకు చెప్పాల్సిన అవసరంలేదు. నిజా, ఎదుటివ్యక్తికి అన్న పరిస్థితి ఉద్భవిస్తేగానీ నేను చంపను! ఆర్మీ నన్ను అలా తయారుచేసింది! కానీ, అసలు వ్యక్తిని అందుకోడానికి ఎన్ని శవాల మీదెక్కుతానో నాకు తెలీదు. అడ్డొచ్చిన ప్రాణి ఆరిపోతుంది!" మనోజ్ గంభీరంగా అన్నాడు.

విరూపాక్షరావు తలపంకించాడు. మళ్ళీ మధ్యలో కూచున్నాడు. "శత్రువులు నా అనుచరుల్ని యెక్కడ దాచారో ఖచ్చితంగా తెలీకపోయినా, చూచాయగా తెలుసు. నేను క్లూ మాత్రం ఇవ్వగలను. నువ్వే పరిశోధించుకుంటూ ముందుకు వెళ్ళాలి! కూచో, నేను తెలుసుకున్నది నీకు తెలుపుకేస్తాను...." అన్నాడు మెల్లిగా.

మనోజ్ కూచుని, రెప్పవేయకుండా అతన్నే చూడసాగేడు. విరూపాక్షరావు ప్రారంభించాడు.....

• • •

చెప్పడం ముగించి విరూపాక్షరావు కుర్చీలో వెనక్కివాలాడు. అతని చెయ్యి టేబుల్ కిందికి పోయింది.

నిమిషం తరవాత తలుపు తోసుకుని సింహాం, హనుమాన్ లోపలికివచ్చారు. మోసుకువచ్చిన ట్రేని టేబుల్ మీద పెట్టి హనుమాన్ చేతులు కట్టుకు నిలబడ్డాడు. అతని కళ్ళు వోరగా మనోజ్ నే చూస్తున్నాయి. అతని మోహంలో నవ్వులేదు.

"హనుమాన్, మనోజ్ ఈ క్షణంనుంచీ మనవాడు!" విరూపాక్షరావు నవ్వుతూ అన్నాడు.

(ఇంకావుంది)